'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

వాణిజ్య నౌకలకు రక్షణ

గాజా యుద్ధం రోజురోజుకూ రావణకాష్ఠంలా మారుతున్నది. చిలికిచిలికి గాలివానలా మారి ఇతర దేశాలను చుట్టుముడుతుందా? అంతిమంగా అది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పనామా కాలువ గుండా తిరిగే అంతర్జాతీయ నౌకలపై యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు ఇటీవల జరుపుతున్న దాడులు ప్రపంచ దేశాలకు సమస్యగా మారుతున్నది. గాజాలోని పాలస్తీనా ప్రజలకు మద్దతుగా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా వారు దాడులు ముమ్మరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్‌కు రసాయనాలతో వస్తున్న ఓడపై జరిగిన డ్రోన్ దాడి కలకలం సృష్టించింది. డ్రోన్ దాడి వల్ల వ్యాపించిన మంటలు వెంటనే ఆర్పేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే దేశాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శల మంటలు పైపైకి లేస్తున్నాయి. మరోవైపు రక్షణ దళాల మోహరింపు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఆ నౌక ఇజ్రాయెలీ కుబేరుడు ఐదాన్ ఓఫెర్‌కు చెందినది కావడం గమనార్హం. ఇరాన్ భూభాగం నుంచి జరిపిన డ్రోన్ దాడి వల్లే నౌకలో మంటలు వ్యాపించాయని అమెరికా ఆరోపించింది. ఇటీవలి కాలంలో నౌకలపై ఎన్నోసార్లు దాడులు జరిగినప్పటికీ అగ్రరాజ్యం ఇలా సూటిగా ఇరాన్‌పై ఆరోపణ చేయడం ఇదే ప్రథమం. అయితే ఇరాన్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమానికి అమెరికా ఇస్తున్న మద్దతుపై ప్రపంచ దేశాల్లో వెల్లువెత్తుతున్న వ్యతిరేకత నుంచి దృష్టి మరల్చేందుకే వాషింగ్టన్ ఈ తరహా సంచలన ఆరోపణలు చేసిందని ఇరాన్ ఎదురుదాడికి దిగింది.

ఈ వ్యవహారాన్ని స్థూలంగా గమనిస్తే ఇజ్రాయెల్ కంపెనీకి చెందిన ఓడలో సాదీ రసాయనాలు భారత్‌కు తరలిస్తుంటే ఇరాన్ డ్రోన్ దాడి చేసిందని అమెరికా ఆరోపిస్తున్నది. పైకి చూస్తే చిన్న డ్రోన్ దాడిలా కనిపించే ఈ ఘటన ఇన్ని దేశాలను చుట్టేసిందన్నమాట. ఒకవేళ ఇరాన్ కాకుండా ఆ దేశం అండదండలు అందిస్తున్న హౌతీ తిరుగుబాటుదారులే డ్రోన్ దాడి చేశారని అనుకుంటే వారు ఇటీవల జరిపిన దాడులన్నిటిలోకెల్లా ఇదే సుదూరమైనది అవుతుంది. హౌతీల దాడులు ఎర్రసముద్రం, యెమెన్ తీరంలోని బాబ్-అల్ మందాబ్ జలసంధి, ఆ చుట్టుపక్కల ప్రాంతాలకే పరిమితం. కానీ తాజా డ్రోన్ దాడి గుజరాత్ తీరానికి 370 కిలోమీటర్ల (200 నాటికల్ మైళ్లు) దూరంలో జరిగింది. ఇది సహజంగానే భారత్‌కు తీవ్ర ఆందోళన కలిగించే విషయం.

హౌతీ దాడులను అడ్డుకునేందుకు బహుళ పాక్షిక నౌకాదళ చొరవను అమెరికా ప్రకటించింది. అందులో బ్రిటన్, బహ్రెయిన్, కెనడా, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్స్, నార్వే, స్పెయిన్, సీషెల్స్ తదితర దేశాలున్నాయి. ఈ తరహా అంతర్జాతీయ స్పందన ఓవైపు సాగుతుండగానే మరోవైపు భారత్ తన వాణిజ్య ప్రయోజనాల రక్షణకు మూడు యుద్ధనౌకలను అరేబియా సముద్రంలో మోహరించింది. ఇలా పలు దేశాలు తమ రక్షణ బలగాలను పంపించడం దాడుల దృష్ట్యా తక్షణ అవసరంగా కనిపిస్తున్నప్పటికీ ఏ చిన్న నిప్పురవ్వ ఎగిరిపడినా దేశాల మధ్య యుద్ధాలు తలెత్తే ప్రమాదముంటుందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఓ యువరాజు హత్యతో మొదటి ప్రపంచ యుద్ధం మొదలైంది. పోలెండ్‌పై జర్మనీ దాడితో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. ప్రస్తుతం వాణిజ్య నౌకాయానం ఎదుర్కొంటున్న సమస్యకు మూలం గాజాలో ఉన్నది. మూలంలో మందు వేస్తే ప్రపంచ శాంతికి దోహదం చేస్తుంది. అందుకు అగ్రరాజ్యం అమెరికాతో సహా అన్ని దేశాలూ కలిసిమెలిసి కృషి చేయాల్సి ఉన్నది.

పేలుడు పదార్థాలు నిల్వ చేసే గోదాములు రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల ఉన్నాయి. గ్రానైట్, క్రషర్లు తదితర మైనింగ్ నిర్వహణకు ఉపయోగించే పేలుడు పదార్థాలను నిల్వ చేసే గోదాములపై ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడింది. ఈ నేపథ్యంలో వీటి నిర్వహణకు సంబంధించి విధివిధానాలు, నియమనిబంధనలు ప్రకటించాల్సిన అవసరం ఉన్నది.

పేలుడు పదార్థాల గోదాములపై పర్యవేక్షణేది?

పేలుడు పదార్థాల నిల్వ చేసే గోదాములకు అగ్నిమాపక శాఖ అనుమతులు అవసరమా? ఎలాంటి స్వభావం కలిగిన భూమిలో గోదాం ఏర్పాటు చేయాలి? ఆ గోదాం జనావాసాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు ఎంత దూరంలో ఉండాలి? నెలవారీగా అమ్మకాలకు సంబంధించిన దస్త్రాలు నిర్వహించాలా? ఇటువంటి గోదాం విషయంలో పోలీసుల పాత్ర ఏమిటి? లైసెన్స్, అధికారుల పర్యవేక్షణ, గ్రామ పంచాయతీ తీర్మానం.. తదితర అంశాలపై స్పష్టమైన నిబంధనలను అధికారికంగా ప్రకటించాలి.

వరంగల్ జిల్లాలోని ఓ మండల కేంద్రంలో ఇటువంటి గోదాం ఉన్నది. ఈ గోదాం జనావాసాలకు సమీపంలోనే ఉండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీస్ స్టేషన్, రెవెన్యూ కార్యాలయానికి రెండు వందల గజాల దూరంలోనే ఉన్న ఈ గోదాం నిర్వహణ పట్ల ప్రజల్లో నెలకొన్న భయాందోళనలకు తెరదించాలి. తమకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, నిబంధనలు పాటిస్తున్నామని నిర్వాహకులు చెప్తున్నారు. అయినప్పటికీ జనావాసాలకు సమీపంలోనే ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇటువంటి గోదాముల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించాలి. నిబంధనల మేరకు నిర్వహిస్తున్నారా? లేదా అనేది పర్యవేక్షించాలి.

- కోగిల చంద్రమౌళి

అడవి బిడ్డలకు అన్యాయం

అజ్మీర సీతారాం నాయక్

భూమిని, ప్రకృతిని నమ్ముకొని ఆదివాసీ- గిరిజనులు జీవిస్తుంటారు. ప్రకృతిని ఆరాధిస్తూ, ప్రకృతి సంరక్షకులుగా కొండలు, కోనలనే నిలయాలుగా చేసుకొని బతుకుతుంటారు. మరికొందరు స్థిరంగా ఒకచోట నివసించకుండా దేశవ్యాప్తంగా సంచరిస్తూ మన దేశ నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు. దేశ రక్షణలో భాగస్వాములై తనువులు చాలించిన ఎందరో గిరిజన వీరులు చరిత్రపుటల్లో స్థానం దక్కక పునాది రాళ్లుగా మిగిలిపోయారు.

మన దేశంలో చరిత్రకెక్కిన కొంతమంది ప్రజాస్వామ్యవాదుల కంటే ముందే జన్మించిన గిరిజన వీరులు, యోధులు, వారి ఆరాధ్య దైవాల చరిత్ర కండ్లముందే వేల సంవత్సరాలుగా కదలాడుతున్నది. అక్షరీకరణ కాకపోవడంతో అవి సమాజానికి చేరలేదు. సమ్మక్క-సారక్క, బంజారాల ఆరాధ్య దైవం సంత్ సద్గురు శ్రీశ్రీ సేవాలాల్ మహరాజ్, లక్కీ షా బంజారా, బిర్సాముండా, కొమ్రం భీం, తల్కం చందు (కేరళ) మొదలైన గిరిజన నాయకుల చరిత్రలతో పాటు భారతీయ ఇతిహాసాల్లో కనిపించే గిరిజనుల పాత్రలు అమోఘమైనవి. చెంచులు, కోయలు, గోండులు, ఎరుకలతో పాటు మహాభారతంలో గిరిజన యోధుడు ఏకలవ్యునిపై పరిశోధనలు జరగాల్సిన అవసరం, ఆవశ్యకత ఉన్నది.

ఆధునిక యుగంలోనూ ఆదిమ గిరిజనులు మాట్లాడే భాషకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లిపిని తీసుకురాలేకపోయాయి. అత్యధికులు మాట్లాడే గిరిజన భాషను ఎనిమిదో షెడ్యూల్లో చేర్చకపోవడంతో తరతరాలుగా వారి చరిత్ర, ఇతిహాసాలు వారికే పరిమితం అయిపోయాయి. దక్షిణ భారతదేశంలో కుంభమేళాను తలపించే సమ్మక్క- సారలమ్మ జాతర మౌఖిక సాహిత్యం, ప్రజల విశ్వాసం ఆధారంగానే జరుగుతున్నది. ఇప్పటి వరకు ఆ జాతర చారిత్రక వాంగ్మూలాలను వెతికే ప్రయత్నం జరగకపోవడం విచారకరం.

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే రాజ్యాంగ నిర్మాతలు రిజర్వేషన్లను తీసుకువచ్చారు. ఎవరి దయాదాక్షిణ్యాల మీదనో వాటిని రాజ్యాంగంలో చేర్చలేదు. విదేశీయులైనప్పటికీ మోర్లే మింటో-మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ అణచివేతకు గురైన వర్గాల వారిని గుర్తించారు. వారి సమగ్రాభివృద్ధికి రిజర్వేషన్లను అమలు చేశారు.

అమెరికా లాంటి అగ్రరాజ్యాల్లోనూ రిజర్వేషన్ విధానం ఉన్నది. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత రాజ్యాంగ నిపుణులు పై వర్గాల వారిని ఎస్సీ, ఎస్టీలుగా గుర్తించి రిజర్వేషన్లు కల్పించారు. విద్యా, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ల విధానాన్ని ప్రవేశపెట్టారు.

12వ శతాబ్దం నుంచి దాగి ఉన్న గిరిజనుల ఇతిహాసం, కనుమరుగవుతున్న వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లు, కళారూపాలను కాపాడాలి. వారు

మాట్లాడే భాషకు లిపి కనుక్కోవడం, వారి జీవన విధానంలో మార్పులు తదితర అనేక అంశాలను పరిశీలించి పరిశోధనాత్మక పత్రాలను రూపొందించాలి. గిరిజన విశ్వవిద్యాలయాల్లో ఆయా ప్రాంతీయ భాషల్లో పరిశోధనలు చేయడం ద్వారానే ఇది సాధ్యపడుతుంది.

గిరిజనుల జీవితాల్లో మార్పు రావాలంటే గిరిజనులు ఉన్నత విద్యనభ్యసించాలని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వారి కోసం ప్రత్యేకంగా కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాలను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా పార్లమెంటు ఉభయ సభల ఆమోదం లభించింది. ఫలితంగా 2007లో మధ్యప్రదేశ్‌లోని అమరకంటక్‌లో ఇందిరాగాంధీ జాతీయ గిరిజన విశ్వ విద్యాలయం ప్రారంభమైంది. 2008 జూలై నుంచి అది అందుబాటులోకి వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు 2019లోనే ఏపీలో కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయాన్ని ప్రారంభించింది. విజయనగరం జిల్లా కొండకరకంలో ఉన్న ఈ యూనివర్సిటీలో ప్రస్తుతం తరగతులు జరుగుతున్నాయి. ఎన్నో ప్రయత్నాల ఫలితంగా విభజన హామీ ప్రకారం.. తెలంగాణకు రావాల్సిన సమ్మక్క- సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం 2023 అక్టోబర్‌లో మంజూరైనది. ములుగు జిల్లాలో నెలకొల్పనున్న ఈ విశ్వ విద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నది.

ఒక ప్రత్యేక ఆశయంతో విద్యా సంస్థలు స్థాపించినప్పుడు సాధారణంగా ఆయా సామాజిక వర్గాల వారికి 70 శాతానికి పైగా అడ్మిషన్లు దక్కుతాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏకలవ్య పాఠశాలలు, రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన గురుకుల పాఠశాలల్లో ఆయా వర్గాల వారికి 70 శాతానికిపైగా రిజర్వేషన్ అమలవుతున్నది. కానీ, దురదృష్టకర విషయం ఏమంటే గిరిజనుల పేరుతో స్థాపించిన కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయాలను యూజీసీ నిబంధనల ప్రకారం ప్రారంభించడం. దీనివల్ల గిరిజన విద్యార్థులకు 7.5 శాతం సీట్లే దక్కనున్నాయి. ఈ విశ్వవిద్యాలయాలను కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించాలి. అప్పుడే అనుకున్న ఆశయం నెరవేరుతుంది.

తెలిసో, తెలియకో జరిగిన ఈ పొరపాటు వల్ల గిరిజన బిడ్డలు అన్యాయానికి గురవుతున్నారు. ఈ పొరపాటును కేంద్ర ప్రభుత్వం వెంటనే సరిదిద్ది గిరిజన విద్యార్థులకు 70 శాతం అడ్మిషన్లు కల్పించాలి. మిగిలిన సీట్లను ఇతరులతో భర్తీ చేసి అడవి బిడ్డలకు న్యాయం చేయాలి.

వ్యాసకర్త: మాజీ పార్లమెంట్ సభ్యులు

నయా బానిసత్వానికి విముక్తి ఎన్నడు?

శ్రమ దోపిడీ ఓ సామాజిక దురాచారం. సాంకేతిక యుగంలోనూ ప్రపంచవ్యాప్తంగా అనేకమంది శ్రమ దోపిడీకి గురవుతున్నారు. శ్రమకు తగ్గ వేతనాలు అందక.. ఎక్కువ సమయం పని చేస్తూ యజమానుల చేతుల్లో బానిసలుగా మారుతున్నారు. వారి చేతుల్లో బంబీలుగా మారిపోయి వెట్టిచాకిరి బాధితులుగా మిగిలిపోతున్న వారు కోకొల్లలు.

ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు వలసపోతున్న వారిలో అత్యధికులు వెట్టిచాకిరి బారిన పడుతున్నారు. ఒక నిర్ణీత సమయం అంటూ లేకుండా వారంతా గొడ్డు చాకిరి చేస్తున్నారు. పొద్దు పొడిచిన దగ్గరి నుంచి పొద్దుపోయే వరకు అహర్నిశలు శ్రమించే వారికి సరైన కూలీ కూడా అందకపోవడం విచారకరం. ఇటుక బట్టీల నుంచి పెద్దపెద్ద పరిశ్రమల వరకు మనకు తారసపడిన వారిని ఒకసారి పలకరిస్తే అసలు విషయం తెలుస్తుంది. వారక్కడ ఇష్టంగా పని చేస్తున్నారా? లేదా బలవంతంగా పని చేయాల్సి వస్తున్నదా? అనేది అవగతం అవుతుంది. అప్పులు, ముందస్తు చెల్లింపుల కారణంగా లక్షల మంది ఇప్పటికీ అయిష్టంగానే వెట్టిచాకిరి చేస్తున్నారు. ఒకరి కింద బానిసలాగా బతకాలని ఎవరికి మాత్రం ఉంటుంది. కానీ, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, మన దేశంలో జనాభాకు తగ్గట్టుగా ఉపాధి కల్పన లేకపోవడం తదితర కారణాల వల్ల లక్షల మంది ఈ సామాజిక దురాచారానికి గురవుతున్నారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 23 ప్రకారం బలవంతంగా పని చేయించడం, మానవ అక్రమ రవాణా నేరం. దాన్ని రూపుమాపడం ప్రభుత్వాల బాధ్యత. వెట్టిచాకిరి బాధితులు ఎక్కడ కనిపించినా వారికి విముక్తి కల్పించి పునరావాసం కల్పించాలి. 1978లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం బాధితుల పునరావాసం కోసం రూ.4,000 ఆర్థిక సాయం చేయాలి. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చట్టంలో పొందుపరిచారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా దీన్ని 2000 సంవత్సరంలో రూ.20 వేలకు, 2022లో రూ.30 వేలకు పెంచారు. ప్రత్యేక పరిస్థితుల్లో పురుషులకు రూ.లక్ష, మహిళలు, బాలలకు రూ.2 లక్షలు, లైంగిక వేధింపులకు గురైనవారికి రూ.3 లక్షల వరకు పునరావాసం కోసం సాయం చేసేలా జిల్లా కలెక్టర్లకు వెసులుబాటు కల్పించారు. దీంతో పాటు వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందినట్టు ఓ ధ్రువీకరణ పత్రాన్ని కూడా జారీ చేయాలి. విముక్తి పొందిన వారికి ధ్రువపత్రాలు జారీ చేస్తున్న ప్రభుత్వాలు.. బాధితులకు పునరావాసం కల్పించడంలో అలసత్వం వహిస్తున్నాయి. ఆర్థిక సాయం చేయాల్సి ఉండటంతో ఈ విషయంలో ప్రభుత్వాలు వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో వారంతా కొంతకాలానికి కొత్త ప్రాంతానికి వెళ్లి అక్కడ తిరిగి వెట్టిచాకిరి బాధితులుగా మారుతున్నారు.

వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించి, వారికి పునరావాసం కల్పించే విషయంలో మన ప్రభుత్వాలు విఫలమయ్యాయనే చెప్పాలి. 1978 నుంచి చూసుకుంటే కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం ఇప్పటివరకు 3,15,302 మంది వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందారు. వారిలో 2,96,305 మందికి ప్రభుత్వం పునరావాసం కల్పించింది.

2030 నాటికి 1.8 కోట్ల మందిని వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం 2016లో సంకల్పించింది. ఆ నాటి నుంచి చూసుకుంటే 32,873 మందికి మాత్రమే విముక్తి కల్పించడం గమనార్హం. అంటే సరాసరి ఏడాదికి సుమారు 4,696 మంది విముక్తి పొందారు. భారత ప్రభుత్వం నిర్దేశించుకున్న 1.8 కోట్ల లక్ష్యంలో ఇది సుమారు 2 శాతం.

ఇప్పటి వరకు విముక్తి పొందిన బాధిత కార్మికులు ఎక్కువగా ఐదు రాష్ట్రాల్లోనే ఉండటం గమనార్హం. కర్ణాటక (66,281), తమిళనాడు (65,573), ఒడిశా (51,441), ఉత్తరప్రదేశ్ (42,279), ఆంధ్రప్రదేశ్ (38,141) ముందు వరుసలో ఉన్నాయి. ఇది 84 శాతం.

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన చట్టం కింద నమోదవుతున్న కేసుల్లో అత్యధిక శాతం ఎస్సీ, ఎస్టీలే బాధితులుగా ఉండటం బాధాకరం. 2019లో ఈ చట్టం కింద 1,155 కేసులు నమోదవగా.. వాటిలో 96 శాతం బాధితులు ఎస్సీ, ఎస్టీలే. 2020లో నమోదైన 1,231 కేసుల్లో 94 శాతం, 2021లో నమోదైన 592 కేసుల్లో 96 శాతం వారే బాధితులు. నమోదైన కేసుల సంఖ్యతో సమానంగా విముక్తి కల్పించిన వారి సంఖ్య లేకపోవడం విచారకరం. విముక్తి కల్పిస్తున్నప్పటికీ వారి వివరాలు బయటికి రావడం లేదనేది ఓ వాదన. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, రాజకీయ నేతల హస్తం ఉండటం తదితర కారణాల వల్ల కొన్ని సందర్భాల్లో జిల్లా యంత్రాంగాలు ఈ వివరాలను బయట పెట్టడం లేదని తెలుస్తున్నది.

మారుతున్న కాలానికి అనుగుణంగా వెట్టిచాకిరి లోనూ మార్పులు సంభవిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా ఆధునిక బానిసత్వం పుట్టుకొచ్చింది. ఈ బానిసత్వంలో అనేకమంది తమ కుటుంబాల కోసం యాజమాన్యాలను ప్రశ్నించకుండా మిన్నకుంటున్నారు. శ్రమకు తగ్గ వేతనాలు లేకపోయినా సర్దుకుపోతున్నారు. వారికి కార్మిక చట్టాలు, శ్రమకు తగ్గ వేతనాలు అమలు కావడం లేదు. ఓ సంస్థ అంచనా ప్రకారం మన దేశంలో 1.1 కోట్ల మంది ఆధునిక బానిసత్వంలో మగ్గుతున్నట్టు తేలింది. వారిలో 83 శాతం మంది ఎస్సీ, ఎస్టీలే ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో ఇరాన్, దక్షిణ కొరియా, ఉత్తర కొరియా, భారత్‌లో మాత్రమే ఈ ఆధునిక బానిసత్వాన్ని రూపుమాపేందుకు సరైన ప్రణాళికలు లేకపోవడం పరిస్థితికి అద్దం పడుతున్నది.

- ఎడిటోరియల్ డెస్క్

వణికిస్తున్న రేబిస్ ముప్పు!

దేశవ్యాప్తంగా శునకాల దాడులు ఎక్కువవుతున్నాయి. కుక్కకాటుకు గురై అనేకమంది గాయాల పాలవుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం.. దేశంలో ఏటా కుక్కకాటు వల్ల 20 వేల మంది మృత్యువాతపడుతున్నారు. అంటే రోజుకు సగటున 55 మంది మరణిస్తున్నట్టు లెక్క. ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న శునకాల దాడుల్లో 36 శాతం భారత్‌లోనే కావడం ఆందోళనకరం.

ఇరవై ఏండ్ల కిందట కుక్క కరిస్తే బొడ్డు చుట్టూ ఇంజెక్షన్లు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కుక్కకాటు వల్ల రేబిస్ వ్యాధి వస్తుందనేది మనందరికీ తెలిసిందే. కానీ, అన్ని శునకాల వల్ల రేబిస్ సోకుతుందనేది అపోహ మాత్రమే. రేబిస్ ఒక ప్రాణాంతక వ్యాధి. శునకాలే కాకుండా పిల్లి, కోతి, ముంగిస, ఎలుక తదితర జీవులు కరిచినా రేబిస్ వ్యాధి సోకుతుంది. ఇది తెలియని చాలా మంది కుక్కకాటుకు గురైనా, పిల్లి కరిచినా ఏం కాదులే అని మిన్నకుండిపోతున్నారు. నిర్లక్ష్యం వహిస్తూ చికిత్స చేయించుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. దీంతో రేబిస్ సోకి మృత్యువాతపడుతున్నారు.

కుక్క, పిల్లి, ముంగిస, కోతి తదితర జంతువుల లాలాజలంలో రేబిస్ లిస్సా వైరస్ ఉంటుంది. అయితే రేబిస్ కలిగి ఉన్న, కలిగి లేని వాటిని గుర్తించడం కష్టం. కాబట్టి ఏ జంతువు కరిచినా వెంటనే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. రేబిస్ వైరస్ జంతువుల్లో చేరకుండా ఉండేందుకు ముందుగానే వాటికి వ్యాక్సిన్ వేయిస్తే ఎలాంటి ప్రమాదం ఉండదు. ముందస్తుగా శునకాలకు వ్యాక్సిన్లు వేయించడం వల్ల అమెరికా తదితర దేశాల్లో రేబిస్ మరణాలు చాలా తక్కువ. మన దేశంలోనూ పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేయించడం మొదలైంది. దీంతో చాలా వరకు మరణాల సంఖ్య తగ్గుముఖం పట్టిందనే చెప్పాలి.

శునకం లేదా మరేదైనా జంతువు కరిచిన వెంటనే వ్యాక్సిన్ వేయించుకోవడం మంచిది. రేబిస్ సోకి, వ్యాధి లక్షణాలు కనిపించే వరకు వేచి ఉండటం ప్రమాదకరం. ఆలస్యం చేస్తే మరణించే అస్కారం ఉంటుంది. పిచ్చి కుక్క కరిస్తే రేబిస్ కచ్చితంగా సోకుతుంది. అయితే పిచ్చి కుక్కకు నిర్వచనం ఇవ్వడం అంత తేలికకాదు. మనం రెచ్చగొట్టకపోయినా కరిచిందంటే అనుమానపడాల్సిందే. కరిచిన పది రోజుల్లోపు శునకం మరణిస్తే వ్యాక్సిన్ వేయించుకున్నా ఫలితం ఉండకపోవచ్చు.

ఓ పరిశోధన ప్రకారం.. రేబిస్ వైరస్ ఉన్న శునకం కరిస్తే పది రోజుల నుంచి ఐదేండ్లలోపు ఎప్పుడైనా వ్యాధి బయటపడవచ్చు. శునకం కరిచిన నాటి నుంచి రేబిస్ సోకే వరకు ఉండే వ్యవధిని ఇంక్యూబేసిన్ పిరీయడ్‌గా పిలుస్తారు. మెదడుకు వైరస్ సోకితే ఆ వ్యక్తి హైడ్రోఫోబియాకి (రేబిస్)కి గురైనట్టే. ఈ స్థితికి చేరిన వ్యక్తికి మెడ భాగంలో కండరాలు వాచిపోతాయి. తీవ్రమైన నొప్పి కారణంగా ఉమ్మిని కూడా మింగలేరు. దీనివల్ల నీళ్లు తాగేందుకు కూడా జంకుతారు. కుక్కకాటుకు గురైన వారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. స్వచ్ఛమైన నీటితో గాయాన్ని కడిగి పొడి వస్త్రాలతో తుడవాలి. గాయమైన చోట గాలి తగిలేలా చూసుకోవాలి. వ్యాక్సిన్ వేయించుకోవాలి.

అడవులను విచక్షణారహితంగా నరకడం వల్ల చిరుతపులి, కోతులు తదితర జంతువులు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఫలితంగా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మనుషులతో పాటు ఇతర జీవరాశులకు భూమిపై జీవించే హక్కు ఉంది. జీవవైవిధ్యం ఆవశ్యకతను గుర్తించి ఇతర జీవరాశులను రక్షించాల్సిన బాధ్యత మనపై ఉన్నది.

-యం. రామ్ ప్రదీప్



చీకటి గదిలా మారిన పార్లమెంట్!

2001లో పార్లమెంట్‌పై దాడి జరిగినప్పుడు అప్పటి ప్రభుత్వం సమాధానమిచ్చింది. మూడు రోజుల పాటు ఘటనపై చర్చ జరిగింది. రాజ్యసభలో ప్రధాని, లోక్‌సభలో హోం మంత్రి సమాధానమిచ్చారు. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నోరు విప్పడం లేదు. హోం మంత్రి సమాధానమివ్వాలని డిమాండ్ చేసినందుకు 146 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. పార్లమెంట్‌ను చీకటి గదిలా మార్చేశారు.

- డెరెక్ ఓబ్రియన్, తృణమూల్ ఎంపీ